నేడు సంకట హర చతుర్థి

నస్పూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మి గణపతి దేవాలయంలో ఈ నెల 16న బుధవారం సంకట హర చతుర్థిని పురస్కరించు కుని స్వామి వారికి పెరుగుతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు, ప్రధానార్చకులు గంగారపు వంశీ కృష్ణ శర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం షోడశ ద్రవ్యాభిషేకం, అష్ట ద్రవ్య గణపతి, లక్ష్మి గణపతి హోమం, స్వామి వారికి సాయంత్రం పెరుగుతో విశేష మహా పెరుగాభిషేకం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభిషేకం అనంతరం పల్లకి సేవ, చంద్ర దర్శనం తర్వాత అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్య హాజరై స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

వీడ్కోలు హంగామా




నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జన్నారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీర శ్యామ్ నాయక్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు డిగ్రీ తర్వాత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్ని అలరించాయి. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ముత్యం సతీష్, అధ్యాపకులు మోహన్, శ్రావణ్ నాయక్, రాజన్న పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలయ్యేనా..?



- 2009 చట్టానికి ఆదిలోనే పాతర
- ఉచిత విద్యకు నోచుకోని పేద విద్యార్థులు
- ప్రైవేటు బడుల్లో అమలుగాని 25 శాతం రిజర్వేషన్
- కోర్టు ఆదేశాలతోనైనా కదలిక వచ్చేనా...?



మంచిర్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకాకపోవడంతో ప్రత్యేక విభాగాలకు చెందిన విద్యార్థులు తీవ్ర అన్యాయం జరుగుతోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం దేశంలోని 6 నుంచి 14 ఏళ్ల వయస్సుగల పిల్లలందరికీ తప్పనిసరిగా ఉచిత, నిర్బంధ విద్య అమలు చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా పిల్లలకు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (1 నుంచి 8 తరగతులు)ను ఉచితంగా అభ్యసించే హక్కును కల్పించింది. ఏదేని కారణం చేత ఎలిమెంటరీ విద్యను అభ్యసించని యెడల ఎలాంటి ప్రాథమిక విద్య చదవాల్సిన అవసరం లేకుండానే విద్యార్థి నేరుగా తన వయస్సుకు సరిపడా తరగతిలో చేరే అవకాశాన్ని కూడా ఆర్టికల్ 21ఏ కల్పించింది.

ఉచిత విద్యకు ప్రైవేటు విద్యాసంస్థల వెనుకంజ..

విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రత్యేక అర్హతలు గల విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రైవేటు యాజమాన్యాల కింద పనిచేసే విద్యాసంస్థలు వెనుకంజ వేస్తున్నాయి. బడ్జెట్ పాఠశాలలను మినహాయిస్తే దనార్జనే ధ్యేయంగా పని చేస్తున్న కార్పొరేట్, ఇతర ప్రైవేటు విద్యా సంస్థలు చట్టాన్ని తుంగలో తొక్కడమేగాకుండా, ప్రశ్నించిన వారికి అడ్మిషన్లు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 200 వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలు ఉండగా, పదుల సంఖ్యలో కార్పొరేట్ విద్యా సంస్థలు పని చేస్తున్నాయి. అన్ని ప్రైవేటు విద్యాలయాల్లో కలిపి దాదాపు 60వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో ఎక్కడ కూడా...

అమలుకాని చట్టం...

ఎలిమెంటరీ స్థాయిలో పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అమలు చేసేందుకు గాను 2009లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకంగా విద్యాహక్కు చట్టం-2009ని రూపొందించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు తమ విద్యార్థులకు తప్పనిసరిగా విద్యాహక్కు చట్టం అమలు చేయాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో ఈ చట్టం అమలుకు నోచుకోకపోవడంతోపాటు ఆదిలోనే చట్టం నిర్వీర్యం అయింది. ప్రభుత్వాల వైఖరి కారణంగా ప్రత్యేక అ ర్హతలుగల విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టాన్ని విస్మరించడంతో రాష్ట్రవ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ అది అమలు కావడం లేదు. విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం పిల్లలను చేర్చుకోవడంలో ఎయిడెడ్, అన్ ఎయిడెడ్, ప్రత్యేక పాఠశాలలు 25శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉంది. చట్టం ప్రకారం అనాథలు, అంగవైకల్యం గల పిల్లలు, హెచ్ఐవీ సోకిన పిల్ల లకు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్యలో 5శాతం ఉచిత విద్యను అందించాల్సి ఉండగా, షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ)కు 10 శాతం, షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)లకు 4శాతం, బలహీన వర్గాలు (బీసీ), మైనారిటీలకు-6శాతం ఉచితంగా విద్యను బోధించాల్సి ఉంది.

(తరువాయి 7వ పేజీలో)

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 'బయోమెట్రిక్'

- ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌కు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు

6

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత

- రెండు వైద్యుల పోస్టులు ఖాళీ
- రాత్రి వేళల్లో రోగులకు తప్పని ఇక్కట్లు
- రెగ్యులర్ వైద్యులు లేక ఇబ్బందులు

7



పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మ

దండేపల్లి (లక్షెట్టిపేట) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మ అన్నారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా లక్షెట్టిపేట మండలం లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహారంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునన్నారు. మొదటి వెయ్యిరోజులు పిల్లల ఎదుగుదలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వారికి ఎలాంటి మానసిక, శరీర సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు సరైన పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించడం వల్ల రోగ నిరోధక శక్తిపెరిగి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ల మమత, అంగన్‌వాడీ టిచర్ల అలివేణి హేమలత, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

గుడుంబా నిర్మూలనకు యువకులు కృషి చేయాలి



మామిడిపల్లిలో గుడుంబా విక్రయించవద్దని మహిళకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్ఐ

వేమనపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి గ్రామంలోని యువకులు గుడుంబా నిర్మూలనకు కృషి చేయాలని నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పిలుపునిచ్చారు. గిరిజన దళిత కుటుంబాలను నాశనం చేస్తున్న గుడుంబాను విక్రయించవద్దని, తయారు చేయవద్దని తెలిపారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గుడుంబా విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్న చిడం సమ్మక్క, కొర్తె చంద్రయ్యలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి గుడుంబా తయారు చేయవద్దని, విక్రయించవద్దని కోరారు. ఎస్ఐ మాట్లాడుతూ గుడుంబా తాగడం వల్ల గిరిజనులు, దళితుల జీవితాలు ఆగమవుతు న్నా యని పేర్కొన్నారు. గుడుంబా తయారు చేసే వారు బాగానే డబ్బులు సం పాదించినప్పటికి తాగిన వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ఇటీవల సూరారం గ్రామంలో గుడుంబా విక్రయించే వ్యక్తిని అక్కడి గ్రామ యువకులు పట్టుకుని తమకు సమాచారం ఇవ్వడంతో అతన్ని అదుపు లోకి తీసుకుని కేసు నమోదు చేశామని గుర్తు చేశారు. అనంతరం యువ కులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ గుడుంబా నిర్మూలనపై అవ గాహన కల్పించారు. యువకులు, పోలీసులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యం

- విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్



ప్రారంభించిన ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎస్ఈ గంగాధర్, అధికారులు

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా అందించడమే ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ గంగాధర్ అన్నారు. మంగళవారం చెన్నూరు సబ్‌స్టేషన్‌లో రూ. 1.10 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పీటీఆర్, 8ఎంవీఏ పీటీఆర్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా లో ఓల్టేజీ, విద్యుత్ సమస్యలను తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరాను అందిస్తామన్నారు. పట్టణంలో ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కైసర్, ఎంఆర్‌టీ డీఈ రాజన్న, ఏడీఈ బాలకృష్ణ, ఏఈలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణానికి కృషి చేసిన గొప్ప నేత అంబేద్కర్

- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

జన్నారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నవ సమాజ నిర్మాణానికి కృషి చేసిన గొప్ప నేత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ నిర్వహించిన ఆనందమేళ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంబేద్కర్ ఒక వర్గానికో, మతానికో చెందిన వ్యక్తి కాదని అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న, సీపీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంఈవో విజయ్‌కుమార్, నాయకులు బాదావత్ ప్రకాష్ నాయక్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



ఎర్రగుంటపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎర్రగుంటపల్లి, నాగాపూర్, పొన్నారం, బీరెల్లి, సోమనపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బీరెల్లిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించారు. అనంతరం ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కర్నాల లింగయ్య కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం జై బాపు, జై భీం, జైసంవిధాన కార్యక్రమంలో భాగంగా సోమనపల్లి గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం

- క్యాతన్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ



ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎంపీ వంశీ, ఎమ్మెల్యే వివేక్,కలెక్టర్ కుమార్ దీపక్

రామకృష్ణాపూర్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ అన్నారు. మంగళవారం క్యాతన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్‌బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి మాట్లా డారు. క్యాతన్‌పల్లి ప్రజల దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్రారంభోత్సవం ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఎంతో కృషి చేశారన్నారు. ఆనాడు కాకా వెంకట స్వామి సింగరేణి ప్రాంతంలో అనేక సంక్షేమ పథకాలను కార్మికుల కోసం వారి హక్కులకోసం పనిచేశాడని నేడు కాకా వారసత్వాన్ని కొనసాగించేందుకు చెన్నూర్, బెల్లంపల్లి, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించడంలో వెనుకాడ బోనని అన్నారు. ఎన్నికల సమయంలో క్యాతన్‌పల్లి, రామకృష్ణాపూర్ మంచిర్యాల ప్రాంతానికి ప్రధానంగా ఉన్న బ్రిడ్జి సమస్యను పరిశీలించిన వెంటనే అధికారంలోకి వచ్చిన వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మాట ఇచ్చామని అది నిలబెట్టుకున్నామన్నారు. అదే విధంగా సింగరేణి కార్మికులకు పింఛన్ స్కీమ్‌ను పదివేలకు పెంచాలని పార్లమెంట్‌లో ఈ ప్రాంత ప్రజలహక్కును సంబంధిత మంత్రికి విన్న వించామన్నారు. అనంతరం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన వెంటనే బ్రిడ్జిని ప్రారంభించేందుకు సన్నహాలు చేపట్టి కాంట్రాక్టర్‌కు రావాల్సిన నిధులు, భూనిర్వా సితులకు అందాల్సిన నష్టపరిహా రాన్ని పూర్తిస్థాయిలో అందించిన వెంటనే బ్రిడ్జి పనులు వేగవంతమయ్యాయన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చడం ప్రజాప్రతినిధిగా నాకర్తవ్యమని, అదేవిధంగా మున్సి పాలిటిలోని రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సౌకర్యంకోసం ప్రత్యేకనిధులను మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపడు తామన్నారు. ఈ ప్రారంభోత్సవానికి కలెక్టర్ కుమార్‌దీపక్, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీనివాస్, మాజీ మున్సి పల్ చైర్మన్ జంగంకళ, మాజీ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ అజీజ్, యాకూబ్ అలీ, బీరం శ్రీనివాస్‌గౌడ్, గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

చెన్నూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహాత్మా జ్యోతిబాఫూలే పాఠశాలలో మంగళవారం అంబేద్కర్ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ విద్యార్థులు, నాయకులతో కలిసి రాజ్యాంగ పీఠికను ఆలపించారు. ఆయన మాట్లాడుతూ మన దేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు చదువుల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాడి తిరుపతి, బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకన్న, శ్రీపాల్, లక్ష్మీనారాయణ, శివకృష్ణ, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేసవిలో జ(న)ల ఘోష

- తాగునీటి కోసం ఒకే బావికి 13 మోటార్లు



గూడెంలో ఊగ్గే వాడ కాలనీలో పురాత మంచినీటి బావిలో పదుల సంఖ్యలో విద్యుత్ మోటార్లు

దండేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ ఎండలు మండుతుండడంతో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బావులు అడుగంటిపోతున్నాయి. కాస్తో కూస్తో తాగునీరు ఉన్న బావులకు స్థానికులు విద్యుత్ మోటార్లు అమర్చుకుంటూ దాహం తీర్చుకుంటున్నారు దండేపల్లి మండలం గూడెంలో ఊగ్గేవాడ కాలనీలో పురాతనకాలంలో నిర్మించిన ప్రభుత్వ బావిలో నీళ్లు అట్టడుక్కు చేరుకున్నాయి. నీటిని బొక్కెనతో తోడేందుకు ఇబందులు పడుతున్న కాలనీవాసులు కొందరు ఆ బావికి 13 విద్యుత్ మోటార్లు బిగించుకున్నారు. ఎండలు ఇంకాస్త ముదిరితే ఈ కాస్త నీరు వస్తుందో లేదోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు పారదర్శకంగా పని చేయాలి

- అభివృద్ధి సంక్షేమంపై సమీక్షా సమావేశం



సమావేశంలోమాట్లాడుతున్న ప్రత్యేక అధికారి పురుషోత్తం నాయక్

కాసిపేట, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభి వృద్ధి సంక్షేమ పథకాల అమలుకు అధికారులందరూ పారదర్శకంగా పని చేయాలని మండల ప్రత్యేకాధికారి అజ్మీర పురుషోత్తం నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో వివిధశాఖల మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు, సన్నబియ్యం పంపి ణీ, అర్హులందరికి అందే విధంగా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషన్‌పక్వాడ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల, హాస్టళ్లలో పారి శుధ్యం, తాగునీరు ఇతర మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో అర్హులైన కూలీలందరికి పనిదినాలు కల్పించాలి. కొత్తగా మంజూరు చేస్తున్న రేషన్‌కార్డు దారులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలన్నారు. కొత్తగా నిర్వహిస్తున్న పంచాయతీ భవన నిర్మాణాల్లో పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తయ్యే విధంగా క్షేత్ర స్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలి. ఎస్‌హెచ్‌జీలకు బ్యాంక్ లింకేజీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, పశువైద్య కేంద్రాల పరిశీలన, పాఠశాల విద్యార్థులకు యూనిఫాంలు బడులు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికి డ్రెస్సులు అందుబాటులోఉండే విధంగా చర్యలు తీ సుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో అనాథ పిల్లలను గుర్తించి పేర్లు నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రాజీవ్‌యువ వికాసం దరఖాస్తులను ఈ నెల 30వరకు పరిశీలించారు. ప్రధానమంత్రి విశ్వ కర్మ యోజనకోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ భోజన్న, ఎంపీవో షేక్ సప్దర్ అలీ, ఎంఈవో వెంకటస్వామి, పశు వైద్యాధికారి సరిత, మెడికల్ ఆఫీసర్ దివ్య, ఏపీఎం వెంకటేశ్, ఎన్ఆర్ఈజీఎస్ మల్లేశ్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో బాలికకు గాయాలు

సిర్పూర్(టి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో సోమవారం రాత్రి పిచ్చి కుక్క దాడిలో అవంతి అనే బాలిక గాయపడింది. దీంతో కుటుంబ సభ్యులకు బాలికను కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. పిచ్చి కుక్క మరికొందిరిపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.

బైక్ నుంచి నగదు చోరీ

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బైక్ నుంచి నగదు చోరీ జరిగిన 40 నిమిషాల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకుని అతడి నుంచి రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మీర్ అలీ మంగళవారం మధ్యాహ్నం ఆసిఫాబాద్ పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద తన స్కూటీని పార్కింగ్‌లో పెట్టాడు. స్కూటీ డిక్కీలో రూ.36 వేల నగదు పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఆ నగదును దొంగలించి పారిపోయారు. బాధితుడు ఆసిఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు తిరుపతి, సాగర్ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడున్న సీసీ కెమెరాలను తనిఖీలు చేసి దొంగను గుర్తించి పట్టుకున్నారు అతడి వద్ద ఉన్న రూ.36 వేల నగదును స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. 40 నిమిషాల్లోనే దొంగను పట్టుకుని డబ్బు రికవరీ చేసిన సీఐ రవీందర్‌తో పాటు ఎస్సై ఆంజయ్య, బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్ల సాగర్, తిరుపతిని ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, ఏఎస్పీ చిత్తరంజన్ అభినందించారు.

మరుగుదొడ్ల పనులు పరిశీలన

సిర్పూర్(టి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలంలోని పాతట్లగూడ, షేక్మాద్‌గూడ గ్రామాల్లోని పాఠశాలల్లో నిర్మించిన మరుగుదొడ్లను మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ, జీపీ ఈవో తిరుపతి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులు మిగిలి ఉంటే పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో వసతులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వాంకిడి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జంబుల్‌ధరి నర్సరీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 70 శాతం జర్మినేషన్ ఉందెని, వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవామృత తయారు చేసి మొక్కలకు పిచికారి చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. ఎండలకు మొక్కలు వాడిపోకుండా చూడాలని సూచించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్, కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్

- ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌కు వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం
- ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు

బెజ్జూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యులు, వైద్య సిబ్బంది సరైన సమయానికి విధులకు హాజరయ్యేలా ఆధార్ బేస్డ్ అటెండెన్స్‌ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆదేశాలను అమలు పర్చాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆర్‌సీ నెంబర్ 7711/ప్లానింగ్ తేదీ 29/03/2025 ప్రకారం అన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆధార్ బేస్డ్ అటెండెన్స్ అమలు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాంతీయ ఆసుపత్రులు 6, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 20 ఉన్నాయి. ఇకపై ఆధార్ బేస్డ్ అటెండెన్స్ ద్వారానే ఉద్యోగులకు జీత భత్యాలు చెల్లించనున్నట్లు అధికారులు తేల్చి చెబుతున్నారు.

ఉద్యోగి ఆధార్ నంబర్ ఆధారంగా ఐడీ ని కేటాయిస్తారు. ఐడీ ద్వారా ఉద్యోగి అటెండెన్స్ వివరాలను చెక్ చేసుకునే అవకాశం ఉంది. అటెండెన్స్ వివరాలను సంబంధితశాఖ మంత్రి, డీఎంఈ, డీహెచ్, సెక్రెటరీ, కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు లాగిన్ చేసి వివరాలను పరిశీలించే వీలు ఉండేలా యాప్‌ను రూపొందించారు.

నాణ్యమైన వైద్య సేవలు..

ఈ విధానం వల్ల పేదలకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. విధానంపై ఖమ్మం జిల్లాలో ఇప్పటికే ప్రయోగాత్మక ప్రాజెక్టుగా చేపట్టారు. సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఆధార్ బేస్డ్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని నిర్ణయించి చర్యలు చేపడుతున్నారు. కాగా పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆధార్ బేస్డ్ అటెం డెన్స్ సిస్టం ఏర్పాటు చేయడంపై ప్రజలు, ప్రజాసంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వైద్య, ఆరోగ్య శాఖలో విధులకు డుమ్మా కొట్టే వారికి చెక్ పడనుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల్లో సమయ పాలన పాటించే అవకాశం ఉందని చెబుతున్నారు. కాగా నూతన విధానాన్ని రద్దు చేయాలని కొందరు ఉద్యోగ సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా లీడర్ల ముసుగులో చెలామణి అవుతూ ఏ ఒక్క రోజు కూడా వారు విధులకు హాజరు కాకుండా ప్రైవేటు పనులు చేసుకోవడం, పైరవీలు చేసుకోవడానికి సరిపోతున్నందున ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి రుచించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరైతే డ్యూటీలకు రాకుండా నెల నెలా జీతాలు తీసుకోవడానికి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.


బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వంద రోజులు పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం

కల్పన, ఈజీఎస్ ఏపీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో ఉపాధి హామీ కార్డులు ఉన్న వారికి వంద రోజుల పాటు పని కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీవో: మండలంలో ఉపాధి హామీ కార్డులు ఉన్న వారికి వంద రోజుల పాటు పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో 7,816 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 8376 మంది కూలీలు ఉన్నారు. 4,156మంది పని చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకంలో షెడ్ నిర్మించుకునే అవకాశం ఉందా?

ఏపీవో: జాతీయ ఉపాధి హామీ పథకంలో షెడ్ల నిర్మాణానికి రూ.98 వేలు, కోళ్ల ఫాం షెడ్ల నిర్మాణానికి రూ.56 వేలు, ఎరువుల గుంతల నిర్మాణానికి రూ.16 వేలు అందజేసే వీలు ఉంది. నిబంధనల ప్రకారం నిర్మిస్తే బిల్లులు చెల్లిస్తాం.

ఆంధ్రజ్యోతి: కూలలకు ఎంత వేతనం వస్తుంది?

ఏపీవో: ఉపాధి హామీ పథకంలో కొలతల ప్రకారం పనులు చేపడితే రోజు రూ.307ల వేతనం వస్తుంది. నిబంధనల ప్రకారం కూలీలకు వేతనం చెల్లిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధి పనులు చేసే చోట వసతులు కల్పిస్తున్నారా?

ఏపీవో: ఉపాధి పనులు చేసే చోట నీడ, తాగునీరు, ప్రథమ చికిత్స బాక్సులు అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులు, మేట్లకు సూచించాం. కూలీల వడదెబ్బ బారిన పడకుండా ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు చేయాలని తెలియజేశాం.

\- దహెగాం, ఆంధ్రజ్యోతి

జిల్లా హ్యాండ్‌బాల్ సీనియర్ మహిళల జట్టు ఎంపిక పోటీలు


ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళల ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన 80 మంది పాల్గొన్నారు. ప్రతిభ చాటిన 20 మందిని ఎంపిక చేశారు. వీరు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం లో జరిగే 54వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాధికారి మీనారెడ్డి, అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్యాంసుందర్‌రావు, రమేష్, ప్రధానోపాధ్యాయుడు జంగు, ఏసీఎంఓ ఉద్ధవ్, కోచ్‌లు అరవింద్, రవి, రాకేష్, సాయి, సంజీవ్, సాగర్, క్రీడాకారులు ప్రవీణ్, మన్విత్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణా తరగతులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 18 నుంచి 27 వరకు వేసవిలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నామని ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వర్‌రావు, ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఎలక్ట్రానిక్ రోబోటిక్స్, కడింగ్, ప్రోగ్రామింగ్, మాథమెటిక్, ఫిజిక్స్ సంబంధించిన ప్రాజెక్టులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు సంప్రదించాలని తెలిపారు.

రెండేళ్ల క్రితం తల్లి.. నేడు తండ్రి మృతి

అనాథలైన పిల్లలు


తండ్రి మృతదేహం వద్ద దీనంగా చూస్తున్న పిల్లలు

సిర్పూర్(యు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘాపూర్ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. రాఘాపూర్‌కు చెందిన సోయం హన్మంతు (27)అనే గిరిజనుడు రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. వారం రోజులుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్నాడు. ఎండల తీవ్రతకు రెండు రోజులుగా అస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సోయం హన్మంతు భార్య లక్ష్మి రెండేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. తల్లిదండ్రుల మృతితో పిల్లలు సోయం జంగుబాయి(12), సోయం చంద్రబాన్(10) అనాథలయ్యారు. మంగళవారం తండ్రి మృతదేహం వద్ద దీనంగా పిల్లల చూస్తుండడం స్థానికులను కలిచివేసింది. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ కోవ నాందేవ్, గ్రామస్థులు కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే. పాల్గొన్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, అధికారులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గృహ నిర్మాణ శాఖాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో అన్ని జిల్లాల కలెక్టర్‌లతో నిర్వహించిన సమావేశంలో భూ భారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అర్హుల ఎం°ఎక, తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించనున్నామని చెప్పారు. పైలెట్ గ్రామాల్లో ప్రారంభించిన నమునా ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెప్పారు. మండలాల్లో పైలెట్ గ్రామాలు కాకుండా ఇతర గ్రామాల్లో ఇళ్ల అర్హుల జబితాను ఇందిరమ్మ కమిటీ సభ్యుల సకాకారంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. అత్యంత పేద వారిని గుర్తించి వారికి ప్రా. దాన్యతనిస్తూ జాబితా రూపొందించాలన్నారు. అనర్హుల వివరాలు జాబితాలో లేకుండా పారదర్శకంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పథకంలో పైపులైన లేని గ్రామాల్లో ఇళ్ల జాబితా రూపొందించాలన్నారు. పథకంలో పైపులైన్ లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, ప్రత్యేకాధికారులు ఎంపీడీవోలు, ఎంపీవోలు, కార్యదర్శుల సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


చేతికొచ్చిన కొడుకు చేజారి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతితో తల్లిదండ్రుల రోదన

జైనూర్ మండలం కొండిబాగూడలో విషాదం


షిందే అక్షిత్(ఫైల్)

జైనూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేతికంది వచ్చిన కొడుకు చేజారిపోయేనే తండ్రీ.. మాపై విధి కన్నెర్ర జేసెనే అంటూ తల్లిదండ్రులు రోదించడం స్థానికులను కలిచివేసింది. హైదరాబాద్ లో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొండిబాగూడకు చెందిన షిందే అక్షిత్(24) మృతి చెందాడు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. అక్షిత్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తదితరులు పరామర్శించారు. అక్షిత్ తండ్రి హేమంత్‌షిందే ప్రభుత్వ ఉపాధ్యాయుడు. తల్లి మనీష గృహిణి, ప్రస్తుతం తల్లిదండ్రులు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు కుమారుడు అక్షిత్, కూతురు ఉన్నారు. అక్షిత్ కొంత కాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా వెనక నుంచి సిమెంట్ లోడుతో వస్తున్న లారీ ఢీకొట్టింది. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అక్షిత్ మృతి చెందాడు. ఇటీవలే ఉద్యోగంలో చేరడంతో పెళ్లి చేయాలని తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్న సమయంలోనే మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి.



కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలి



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

జైపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పనిచేస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంటు చేయాలని హెచ్ఎంఎస్ యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య, ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు ఆర్. విక్రమ్‌కుమార్ కోరారు. జైపూర్‌లోని ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద కాంట్రాక్టు కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేసిన విధంగా ఎస్టీపీపీలో కూడా కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను కోరుతున్నామన్నారు. ఎస్టీపీపీ ఏర్పాటు చేసినప్పటి నుంచి పెగడపల్లి గ్రామం ప్లాంట్ నుంచి వెలువడే దుమ్ము, రసాయనాల ద్వారా వాతావరణం కలుషితమైందని చెప్పారు. దీని వల్ల ఇక్కడి ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి పెగడపల్లి గ్రామాన్ని ఆర్‌అండ్‌ఆర్ పరిధిలోకి తీసుకువచ్చి అన్ని సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. పవర్‌ప్లాంట్ పూర్తిగా కాంట్రాక్టీకరణ వల్ల సింగరేణి సంస్థతో పాటు కాంట్రాక్టు కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన జెన్‌కో సంస్థకు ప్లాంటు ఉత్పత్తి బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు సాయికృష్ణరెడ్డి, సంపత్‌కుమార్, నర్సింహారెడ్డి, అనిల్‌రెడ్డి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మా.. నాన్న మీకు భారం కాలేను

సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న యువకుడు


అనిల్‌కుమార్ (ఫైల్)

నెన్నెల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అమ్మా.. నాన్న.. అన్నయ్య నన్ను క్షమించండి.. నా ఆరోగ్యం బాగుండడం లేదు.. మీకు భారంగా ఉండడం ఇష్టం లేదు.. బతకాలంటేనే భయమేస్తుంది.. అన్నయ్య సారీ రా.. నువ్వు ఈలెటర్ చవివే సమయానికి నేను బతికి ఉండను. నాన్న... అమ్మను కష్టపెట్టకు బాగా చూసుకో.. నా అనారోగ్యంతో మిమ్మల్ని బాధపెడుతూ బతకలేను. అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాను.. మీరందరు నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఇక సెలవు అంటూ ఓ యువకుడు రాసిన సుసైడ్ నోట్ కంట తడిపెట్టిస్తోంది. అందులోని ప్రతి వాక్యం భావోద్వేగానికి గురి చేస్తోంది. జెండావెంకటా పూర్ గ్రామానికి చెందిన చెల్మటికారి అనిల్‌కుమార్ (24) అనే యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన చెల్మటికారి సత్తయ్య-అమృతలకు ఇద్దరు కొడుకులు. చిన్నవాడైన అనీల్ మంచిర్యాలలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇటీవలనే పీజీ పూర్తి చేశాడు. మూడు నెలలుగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జాండీస్ రావడంతో మరింత కుంగిపోయాడు. తన రూమ్‌లో పడుకున్న అనీల్ మంగళవారం ఉదయానికల్లా దూలానికి నిర్జీవిగా వేలాడుతు కనిపించాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. బెడ్‌పై లభించిన అనీల్ రాసిన సుసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

పుట్టెడు దుఃఖంలోనూ నేత్రదానం..

చేతికొచ్చిన కొడుకు ఆత్మహత్య చేసుకొగా పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. సోపతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బీమ్‌పుత్ర శ్రీనివాస్, రహీం బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రహీంల ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ ప్రదీప్‌కుమార్ నేత్రాలు సేకరించారు. కొడుకు తమకు దూరమైనప్పటికి అతడి కళ్లు సజీవంగా ఉండాలనే ఈ నిర్ణయం తీసుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ .. ఒకరి మృతి

నస్పూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొరగారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై 50-55 మధ్య వయసు కలిగిన వ్యక్తిని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై నెల్కి సుగుణాకర్ తెలిపారు. నలుపు రంగు టీ షర్టు, బూడిద రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు వెంటనే పోలీస్‌స్టేషన్ తెలియజేయాలని ఎస్సై కోరారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎన్జీవోస్ కాలనీలో మంగళవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. కాలనీవాసులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. దాహార్తి తీర్చుకునేందుకు వచ్చిన సమయంలో కుక్కలు గుంపుగా దాడి చేయడంతో గాయాలై మృతి చెందిందని కాలనీవాసులు తెలిపారు. మృతి చెందిన చుక్కల దుప్పి కళేబరానికి అధికారులు ఖననం చేశారు.

వృద్ధురాలి మృతికి కారకుడైన ఒకరికి జైలు శిక్ష

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో ఓ వృద్ధురాలి మృతికి కారకుడైన వ్యక్తికి 18 నెలల జైలు శిక్షతో పాటు 8 వేల జరిమానా విధిస్తూ మంచిర్యాల ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయ మూర్తి ఉపనిషద్వని తీర్పు ఇచ్చినట్లు శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మంథని మండలం భట్టుపల్లికి చెందిన పోతన వేణి మల్లమ్మ(70) 2017 నవంబర్ 6వ తేదీన శ్రీరాంపూర్ బస్టాండ్‌లో బస్సు దిగి గోదావరిఖని వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో మరో బస్సు ఢీకొట్టింది. చికిత్స పొందుతూ మరణించింది. శ్రీరాంపూర్ అప్పటి ఎస్ఐ రవిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 12 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, నిందితుడు ఆవిడపు సంతోష్‌కు మార్క్ 18 నెలల జైలు శిక్షతో పాటు 8 వేల రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

గుండెపోటుతో డీజీఎం(ఐఈడీ) మృతి


చిరంజీవులు (ఫైల్)

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(ఐఈడీ) కూన చిరంజీవులు (57) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం అర్ధరాత్రి ఆయనకు గుండె నొప్పి రావడంతో రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లడంతో అక్కడే మరణించారు. చిరంజీవులు 1996లో సింగరేణిలో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. రామగుండం, మందమర్రి, భూపాలపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లో పనిచేశారు. ఆయనకు భార్య జ్యోతి, కుమారులు రోహిత్, వినీత్ ఉన్నారు. చిరంజీవులు మృతదేహాన్ని ఆయన స్వగ్రామం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం తీసుకెళ్లారు.

వాహనాల తనిఖీ

పెంచికలపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఏఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏఎస్సై మాట్లాడుతూ వాహనదారులు సరైన వాహనపత్రాలు కలిగి ఉండాలని అన్నారు. హెల్మెంట్ తప్పని సరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా సూచనలు పాటించాలని తెలిపారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు



పోగొట్టుకున్న ఫోన్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ

బెల్లంపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణకు మంగళవారం లక్ష రూపాయల విలువ గల ఐఫోన్ దొరకడంతో వెంటనే తాళ్ల గురిజాల ఎస్‌ఐ రమేశ్‌కు అందజేశారు. దీంతో ఎస్‌ఐ సెల్‌ఫోన్‌లోని వివరాలను పరిశీలించి వాంకిడికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ఫోన్ అని నిర్ధారించుకొని సమాచారం ఇచ్చాడు. పోగొట్టుకున్న ఫోన్‌ను ఎస్‌ఐ, నిజాయితీ చాటుకున్న లక్ష్మీనారాయణ చేతులమీదుగా బాధితుడికి ఫోన్ అందజేశారు.

తొమ్మిది మంది బైండోవర్

నెన్నెల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) పేకాడుతూ పట్టుబడ్డ ఐదుగురిని, గంజాయి సేవిస్తూ పట్టుబడిన మరో నలుగిరిని మంగళవారం తహసీల్దార్ మహేంద్రనాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇకపైన సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించినట్టు చెప్పారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమించి ఇదే నేరాన్ని మరో సారి చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

చెక్కు అందజేత

జన్నారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన రైతు దానవేని రాజుకు చెందిన 11 గొర్రెలను తోడేలు దాడి చేసి హతమార్చింది. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 65 వేల నష్టపరిహారం చెక్కును మంగళవారం ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రవి, ఎఫ్‌బీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
సిబ్బంది కొరత



రెండు వైద్యుల పోస్టులు ఖాళీ
రాత్రి వేళల్లో రోగులకు తప్పని ఇక్కట్లు
రెగ్యులర్ వైద్యులు లేక ఇబ్బందులు

భీమిని, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రోగమొస్తే వైద్యం చేయించుకోవడానికి గ్రామీణులకు అందుబాటులో ఉన్నది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే... గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత ప్రధానంగా వైద్యుల కొరతతో వైద్య సేవలకు అడ్డంకిగా మారుతోంది. సిబ్బంది వైద్యులు లేకపోతే వారు కాళ్లీడ్చు కుంటూ పట్టణాలకు పోవాల్సిందే. భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో సరిపడా వైద్య సిబ్బంది నియమించ కపోవడంతో రోగులకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందని పరిస్థితులు నెలకొన్నాయి. 24 గంటల వైద్య సే వలు అందించాల్సి ఉన్నా వైద్యులు లేకపోవడంతో రోగు లు ప్రైవేటు ఆసుపత్రుల బాట పడుతున్నారు.

ఇన్‌చార్జి వైద్యులే దిక్కు..

భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులకుగాను రెండు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో నెన్నెల ప్రాథమిక వైద్యుడు అనిల్ ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న వైద్యులకు పీజీ రావడంతో రెండు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జి వైద్యుడు కావడంతో భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సరిగా రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో స్టాఫ్ నర్సులే వైద్య సేవలు అందించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

భీమిని పీహెచ్‌సీలో ఖాళీలు..

భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు వైద్యుల పోస్టులకుగానూ రెండూ ఖాళీగా ఉన్నాయి. ఫార్మసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, సీనియర్, సూపర్ వైజర్, భీమిని మొదటి ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పేదల వైద్యం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెపుతున్నా క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అటు కనీస సౌకర్యాలు లేక... ఇటు వైద్యులు సిబ్బంది లేక మండల ప్రజలకు అనారోగ్యానికి గురైతే ఎటు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వారు బెల్లంపల్లి, కాగజ్‌నగర్, మంచిర్యాల తదితర పట్టణాలకు పరుగులు పెడుతున్నారు.

రోజుకు 40 నుంచి 50 మంది రోగులు..

భీమిని ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది సరిపడా లేకపోవడంతో వివిధ రోగాలతో ఆసుపత్రికి వస్తున్న రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజూ 40 నుంచి 50 మంది వరకు సీజనల్ వ్యాధులతో పాటు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతో బాధపడే రోగులు, గర్భిణులు వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి మండలంలో అన్నీ ఖాళీలే....

ఉమ్మడి మండలంలో..భీమిని, కన్నెపల్లి ఉమ్మడి మండలంలో 7 సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో భీమిని సబ్ సెంటర్లో ఇద్దరు ఏఎన్ఎంలు ఖాళీ ఉన్నాయి. హెల్త్ అసిస్టెంట్లలో 7 గురు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే ఉన్నారు దీంతో 5 పోస్టులు ఖాళీ ఉన్నాయి. స్టాఫ్ నర్సులలో నలుగురు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉండి మూడు పోస్టులు ఖాళీ ఉన్నాయి. కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ ఖాళీగానే ఉంది. దీంతో రెండు మండలాల ప్రజలకు వైద్య సిబ్బంది ఖాళీలు ఉండటంతో అరకొరగా వైద్య సేవలు అందుతున్నాయని మండలాల ప్రజలు వాపోతున్నారు. మండల సర్వసభ్య సమావేశాల్లో సిబ్బంది కొరతపై గతంలో పలు తీర్మానాలు కూడా జిల్లా అధికారులకు నివేదికలు ఇచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయాలని కోరుతున్నారు.

సిబ్బంది పై ఒత్తిడి..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఆ భారం ఇతర సిబ్బందిపై పడుతోంది. పోస్టులు ఖాళీగా ఉండటంతో మిగతా వారు సెలవులో ఉన్న సమయాల్లో మిగిలిన సిబ్బంది 12 గంటల పాటూ పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో వైద్య సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో సిబ్బంది ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోంది.

వైద్యుల పోస్టులు భర్తీ చేయాలి..
మంథెన నరేష్, బిట్టూరుపల్లి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఖాళీగా ఉన్న ఇద్దరు వైద్యుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పేదలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లలేకపోతున్నారు. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

విద్యాహక్కు చట్టం అమలయ్యేనా..?

(5వ పేజీ తరువాయి)

విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదు. ప్రశ్నించే వారు లేక విద్యా సంస్థల నిర్వాహకులు వేలకు వేలు ఫీజుల రూపంలో వసూ లు చేస్తున్నారు. విద్యార్థుల పక్షాన పోరాడాల్సిన విద్యార్థి సంఘాల నాయకులు కూడా విద్యాహక్కు చట్టంపై యాజమాన్యాలను ప్రశ్నించ కపోవడం గమనార్హం. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ విషయమై దృష్టిసారించకపోవడంతో చట్టం నిర్వీర్యమయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఈ నెల 24 నుంచి పాఠశాల లకు వేసవి సెలవులు ఉన్నాయి. అనంతరం జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే విద్యాహక్కు చట్టం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపడితే ప్ర త్యేక అర్హతలుగల విద్యార్థులకు మేలు చేకూర్చినట్లు అవుతుంది.

● కోర్టు ఆదేశాలతోనైనా కదలిక వచ్చేనా...?

పేదలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్ల కల్పనపై హామీ ఇవ్వాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి హై కోర్టు ఆదేశించింది. ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం అమలుకోసం జారీ చేసిన మెమోను నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తామని అండర్ టేకింగ్ కోరింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదంటూ 2020లో హైకోర్టులో పలు ప్రజాప్రయో జ న వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఇదే విషయమై దేశ సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు కూడా రెండుసార్లు విచారణ చేపట్టింది. మరోవైపు రాష్ట్ర ప్రభు త్వం గతేడాది అక్టోబర్ 19న మెమో జారీ చేసినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. హైకోర్టు ఆదే శాలతోనైనా రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలుకు నోచుకుంటుందా అనే ప్రశ్నలు పోషకుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

ప్రతిభా పరీక్షను వినియోగించుకోవాలి

దండేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థుల కోసం టీఎస్ యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 24న నిర్వహించే పీపుల్స్ ప్రొగ్రెసివ్ ప్రతిభ ట్రస్టు పరీక్షను జిల్లాలో 4, 5, 6 తరగతి చదువుతున్న విద్యార్థులు 18లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌యు టీఎఫ్ జిల్లా కార్యదర్శులు కొట్టె చంద్రమౌళి, గొర్రె సర్వయ్యలు మంగళవారం ఓప్రకటలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరంలో 5, 6, 7 తరగతుల్లో ప్రవేశం కోసం ఈపరీక్ష నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 5 నుంచి డిగ్రీ వరకు పేద విద్యార్థులకు హైదరాబాద్‌లో ప్రగతి నగర్‌లో కొన్నేళ్లుగా ఉచితంగా విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ ఈవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం టీఎస్ యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుండార పు చక్రపాణి 9704634005, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు 9491345407 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నాసా స్పేస్ పోటీల్లో ..
విద్యార్థులు రాణించడం గర్వకారణం


విద్యార్థులను అభినందిస్తున్న న్యాయాధికారి ముఖేష్

బెల్లంపల్లి, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నాసా స్పేస్ పోటీల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు రాణించడం గర్వకారణమని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ముఖేష్ అన్నారు. మంగళారం విద్యార్థులను అభినందించారు. పోటీల్లో ప్రపంచవ్యాప్తంగా 25దేశాల వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అందులో తెలంగాణ రాష్ట్రంలో శ్రీచైతన్య విద్యార్థులు రాణించారన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొంది బహుమతులు అందుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సంజీవ్, చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్, అరవిందరెడ్డి, జైరాజ్, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : రుణాలు, ఇతర ఆశలు చూపుతూ సైబర్ నేరగాళ్లు డబ్బులు తస్కరిస్తారని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ అన్నారు. మంగళ వారం మధ్యాహ్నం శ్రీరాంపూర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ ప్రోగ్రాం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని, ఏదైనా సమస్య ఉంటే తమ సహాయం తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలబారిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దని ఆయన సూచించారు. అవగాహన వల్లనే మోసపోకుండా ఉండవచ్చని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలను పర్యవేక్షించాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. మంగళవారం మండలంలోని శంకర్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల ఎదుగుదల, కొలతలు, బరువులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, ఎత్తు, బరువులను కొలవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా తెరవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆయా పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

తాండూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టంపేట గ్రామంలో మంగళవారం మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పర్యటించారు. పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వ హించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. రిజిష్టర్‌లను పరిశీలించి పిల్లల బరువు, ఎత్తు కొలతలను క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. నర్సరీని పరిశీలించి మొక్కలను సంరక్షించాలని, మొక్కలకు సమృద్ధిగా నీరు పట్టాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

గర్మిళ్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చక్రపాణి సూచించారు. మంగళవారం మంచిర్యాలలోని డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాల నిరోధక కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మత్తు పదార్థాలపై అవగాహన కలిగించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 16న మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు విద్యార్థులందరు పాల్గొనాలని కోరారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జన్నారం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జన్నారంలోని బస్టాండ్ ప్రాంతంలో అగ్నిమాపక శాఖ అధికారులు అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైరింజన్ యంత్రంలోని నీటితో ప్రదర్శన నిర్వహించారు. బస్టాండ్‌లోని ప్రయాణికులకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి బస్టాండ్‌లో పోస్టర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో జన్నారం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే..ఆస్పత్రి పాలే

● పాఠశాల ఎదుట ప్రమాదకరంగా గుంతలు
● ప్రమాదాల భారిన విద్యార్థులు


పెద్ద ధర్మారం పాఠశాల ఎదుట ప్రహరీ కోసం తవ్విన గుంతలు

కాసిపేట, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దధర్మారం మండల ప్రాథమిక పాఠశాల ప్రహరిగోడ నిర్మాణానికి తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. గుంతలను తవ్విన గుత్తేదారు నిర్లక్ష్యంగా వదిలేశాడు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ప్రతిరోజు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై సంబంధితశాఖ అధికారులకు గ్రామస్తులు చెప్పిన ఎవరు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి 5.42లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రహరీ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణంలో గుత్తేదారు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సుమారు గుంతలు తవ్వి రెండు నెలలు అవుతోంది. పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ముషీరా నజ్మా విద్యార్థి ఇటీవల ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో విద్యార్థినికి చెయ్యి విరిగి తలకు బలమైన గాయమైంది. అయినప్పటికీ సంబంధితశాఖ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. మళ్లీ ఏ విద్యార్థి గుంతలో పడి గాయాలపాలు కాకముందే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్రహరీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెస్ అభివృద్ధి కోసం కమిటీల నియామకం

వేసవిలో ఉచిత చెస్ శిక్షణ తరగతులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెస్ అభివృద్ధి కోసం కమిటీల నియామకం చేపడుతున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్రనాయకులు మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు సిరాజ్ ఉర్ రహమాన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో మండల పట్టణాలకు సంబంధించి చెస్ క్రీడల పట్ల ఆసక్తి ఉన్నవారికి కమిటీలోకి తీసుకుంటున్నామని తెలిపారు. ఈ క్రీడా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వేసవిలో విద్యార్థులకు ఉచిత చెస్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. దీని ద్వారా చెస్ క్రీడాకారులు మెలకువలు నేర్చుకుంటారని వారికి క్రీడల పట్ల పట్టుకూడ సాధిస్తారని తెలిపారు. మందమర్రిలో శిక్షణ తరగతులకు త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపారు. వేసవిలో చిన్నారులను క్రీడల వైపు మళ్లించేందుకు దృష్టిసారించామని తెలిపారు.


సిద్ధయ్యకు నియామక ప్రతం అందజేస్తున్న సిరాజ్ ఉర్ రహమాన్

చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సిద్ధయ్య..

మంచిర్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణంలోని బురదగూడెంకు చెందిన దామాండ్ల సిద్ధయ్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామకపత్రాన్ని చెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు సిరాజ్ ఉర్ రహమాన్ అందజేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య మాట్లాడుతూ త్వరలోనే తమ పాఠశాలలో విద్యార్థులకు చెస్ క్రీడల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమం చేపడతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

తమ పై నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టిన జిల్లా చెస్ అసోసియేషన్‌కు ఆయన కృత జ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదుదారులతో
మర్యాదగా మెలగాలి

జైపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారితో మర్యాదగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి తగు సూచనలు, చర్యలు తీసుకోవాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌ను మంచిర్యాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెండింగ్ కేసులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో అప్రమత్తంగా ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్‌సీఐ వేణుచంద్, ఎస్‌ఐ శ్రీధర్ ఉన్నారు.


జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

యు డైస్ ప్లస్‌పై సర్వే ప్రారంభం

కోటపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని యు డైస్ ప్లస్‌పై జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సర్వే ప్రారంభమైంది. ఇందుకోసం థర్డ్ పార్టీ సర్వే ప్రారంభం కాగా ఈ సర్వేలో డైట్ శిక్షణ ఉపాధ్యాయులు పాఠశాలలను పరిశీలించారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 21 వరకు కొనసాగనుంది. ఇందుకోసం జిల్లాలో 600 పాఠశాలలను ఎంపిక చేయగా 60 మంది డైట్ శిక్షణ ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొన్నారు. పాఠశాలల్లోని వాస్తవ పరిస్థితులను పరిశీలించి ధ్రువీకరించి నివేదికలను ప్రభుత్వానికి అందించనున్నారు. దీంతో ఈ నివేదిక ఆధారంగా పాఠశాలలకు బడ్జెట్ కేటా యించనున్నారు.


కోటపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న సర్వే బృందం

● సమగ్రంగా వివరాలు

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాల లు, కళాశాలలకు సంబంధించిన ప్రధానోపా ధ్యా యులు యు డైస్ ప్లస్‌లో వివరాలన్నీ నమోదు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీల వివ రాలు, మౌలిక వసతులు, ఆధార అనుసంధానం, ఆపార్ నమోదు, మధ్యాహ్న భోజన పథకం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీ, క్రీడా పరికరాలు, క్రీడా స్థలం ఉందా లేదా, గదులు ఎన్నీ, ఇంకా ఎన్ని అవసరం, ఫర్నీచర్, ల్యాబ్ తదితర సదుపాయాలు ఉన్నాయా లేదా పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలు తదితర వివరాలన్నీ ఇందులో సమగ్రంగా నమోదవుతాయి.

ప్రామాణికతపై...

పాఠశాల విద్యా వ్యవస్థ ప్రామాణికతపై విద్యాశాఖ తొలిసారి థర్డ్ పార్టీతో సర్వేకు శ్రీకారం చుట్టింది. యు డైస్ ప్లస్‌లో నమోదైన వివరాలు నిజామా, కాదా అనే దానిపై డైట్ శిక్షణ ఉపాధ్యాయులు సర్వే చేసి వాస్తవ పరిస్థితులను నమోదు చేస్తారు. ఇందుకు సంబంధించి డైట్ శిక్షణ ఉపాధ్యాయులకు శిక్షణ సైతం ఇచ్చారు. ప్రతి రోజు ఒక్కొక్కరు రెండు పాఠశాలల చొప్పున పరిశీలన జరుపుతారు. తొలుత పాఠశాల రిపోర్టు కార్డు ఆధారంగా పరిశీలన జరిపి పాఠశాలల్లో ఉన్న వాస్తవ పరిస్థితులు, వివరాలన్నీ డైస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేశారా లేదా పరిశీలిస్తారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, సౌకర్యాలు ఎలా ఉన్నాయని పరిశీలన జరుపుతారు. నమోదు చేసిన వివరాలు భౌతికంగా పరిశీలన జరిపిన డైట్ శిక్షణ ఉపాధ్యాయులు వివరాలు నమోదు చేశారు. తప్పులుంటే సరి చేయాలని ప్రధానో పాధ్యాయులకు రిమార్కులు రాసి ఇవ్వగా హెచ్‌ఎంలు సీఆర్‌పీల సహకారంతో వాటిని సరి చేయాల ని విద్యాశాఖ అధికారులు సూచించారు.

కోటపల్లిలో 47 పాఠశాలల్లో

కోటపల్లి మండలంలో 47 పాఠశాలల్లో సర్వే చేపట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. కోటపల్లి కాంప్లెక్స్ పరిధిలో 15, సిర్సా కాంప్లెక్స్ పరిధిలో 15, దేవులవాడ కాంప్లెక్స్ పరిధిలో 17 పాఠశాలల్లో యు డైస్ ప్లస్‌పై శిక్షణ ఉపాధ్యాయులు కాంప్లెక్స్‌ల వారీగా సర్వే ప్రారంభించారు. కోటపల్లిలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో డైట్ శిక్షణ ఉపాధ్యాయుని స్రవంతి, సీఆర్‌పీ సంపత్‌లు సర్వే చేసి వాస్తవ పరిస్థితులు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జైపూర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామారావుపేట గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్‌పేర్కొన్నారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యాజమాని సుంకరి రవీందర్, ట్రాక్టర్ డ్రైవర్ పూజారీ సుధాకర్ మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

దండేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మొరం డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగి దాడి చేసుకోవడంతో ఒకరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాసిపేట గ్రామానికి చెందిన లక్కాకుల సృజన్, కళ్లెం సంతోష్‌ల ఇద్దరి మధ్య మొరం డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో కళ్లెం సంతోష్‌పై సృజన్ దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి.

వెంటనే సంతోష్‌ను చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంతోష్ తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు సృజన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు.



నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్

లింగాపూర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని జైనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లింగాపూర్ ఎస్సై గంగన్న అన్నారు. లింగాపూర్ మండలంలోని కిమానాయక్ తండాలో మంగళవారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాల ధ్రువపత్రాలు కల్గి ఉండాలని సూచించారు. తరుచుగా తనిఖీలు చేపడుతాని చెప్పారు. అసాంఘిక కార్యాకలాపాలు గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

బెజ్జూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై ప్రవీణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సతీష్ పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ సమీపంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని కౌటాల సీఐ రమేష్, ఎస్సై నరేష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏకరూపంతోనే బడికి

- పాఠశాలలు తెరిచేనాటికి ఒక్క జతనైనా అందించేందుకు చర్యలు
- ఇప్పటికే కొలతలు తీసుకున్న సిబ్బంది
- జిల్లాలో 47,530 మంది విద్యార్థులు

జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. కనీసం ఒక్క జతనైనా ఇవ్వాలని అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.





విద్యార్థుల కొలతలు తీసుకుంటున్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేసవి సెలవుల అనంతరం తిరిగి పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు కనీసం ఒక్క జతనైనా ఏకరూప దుస్తులు అందజే యాలని జిల్లా విద్యాశాఖ సంకల్పించింది. 2025- 26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజున పాఠశా లకు వచ్చే విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. విద్యాశాఖ నుంచి స్వయం సహా యక సంఘాల సభ్యులకు వస్త్రం సరఫరా కాగానే వేసవి సెలవుల్లో దుస్తులను కుట్టే పనిని ప్రారంభించ నున్నారు. జూన్ నెలలోనే ఒక జత అందజేసేలా ప్రణాళిక రూపొందించారు .మరో జత ఆగస్టులో అందజేయనున్నారు.

ఏటా రెండు జతలు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా రెండు జతల ఏకరూప దుస్తులను ఉచితంగా అందజేస్తారు. ప్రస్తుతం మండల విద్యావనరుల కేంద్రానికి వస్త్రం చేరుకుంది. పూర్తి స్థాయిలో వస్త్రం రాగానే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎన్ని దుస్తులు కుట్టాలో లెక్క తీయనున్నారు. ఒక్కో తరగతి విద్యార్థికి సంబంధించి సాధారణ కొలతల ఆధారంగా కుట్టను న్నారు. సకాలంలో దుస్తులు కుట్టేలా మండల స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసి సభ్యులతో పర్యవేక్షణ చేయించేలా విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. దుస్తులను మెరుగ్గా కుట్టేవారిని ఎంపిక చేయనున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు దుస్తులను కుట్టే బాధ్యత అప్పగించనున్నారు. ఒక్కో జత కుట్టేందుకు 75 రూపాయలు ఇచ్చేందుకు సర్కారు ధర నిర్ణయించింది.

మెరుగైన బోధనతో పాటు..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన బోధనతో పాటు భోజనం, యూ నిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తోంది. జిల్లాలో డీఈవో పరిధిలో 739 పాఠశాలలతో పాటు గిరిజన, కేజీబీవీ, మోడల్‌స్కూల్, యూఆర్‌జేసీ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం కుట్టించి అందజేస్తున్నారు. జిల్లాలోని మొత్తం 930 పాఠశాలల్లో 47,530 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున అందజేయనున్నారు. ఇందులో బాలురు 22,518 మంది, బాలికలు 25,012 మంది ఉన్నారు. వీరి కోసం 1,90,902 మీటర్ల వస్త్రం వచ్చింది. గతంలో 8,9,10,11,12 తరగతుల బాలురకు మాత్రమే ప్యాంటుకు అవకాశం ఉండేది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు 6-12 తరగుతుల విద్యార్థులకు(బాలురు) మొత్తంగా ఏకరూప దుస్తుల్లో నిక్కరు కాకుండా ప్యాంటుకు అవకాశం కల్పించారు. ఏకరూప దుస్తులు ధరించిన విద్యార్థులకు సైజులు కలువకపోవడం, ఎక్కువ తక్కువలకు తావు లేకుండా పకడ్బందీగా కొరతలు ఉండేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మొదట ఒక జత అందేలా..

- రాథోడ్ సుభాష్, ఆసిఫాబాద్ ఎంఈవో



రాబోయే విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు ఒకజత యూనిఫాం అందించేం దుకు కృషి చేస్తున్నాం. మరోజత ఆగస్టులో అందజే స్తాం. ప్రస్తుతం ఒక జత వస్త్రం వచ్చింది. త్వరలోనే మరో జత వస్త్రం వస్తుంది. విద్యార్థులకు అనుగుణంగా యూనిఫాంలు అందజేస్తాం. ఇప్పటికే విద్యార్థుల కొల తలు సైతం తీసుకున్నాం. విద్యార్థులు ఇబ్బందులు పడ కుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో అం దేలా పర్యవేక్షిస్తాం.

నీటి కుంటల తవ్వకం పనుల పరిశీలన



నీటి కుంటల పనులను పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జలవనరుల పెంపు కోసం సింగరేణి సంస్థ చేపట్టిన నీటి కుంటల తవ్వకం పనులను మంగళవారం బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ జీఎం సూర్యనారాయణ జీఎం(ఎన్విరాన్మెంటు) సైదులు పరిశీలించారు. గోలేటి గ్రామ శివారులోని పంట పొలాల వద్ద చేస్తున్న పనులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా భూ గర్భ జలాలు పెరిగి రైతులకు సాగు నీరు అందుబాటులోకి రానుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం(సివిల్) ఎస్‌కె మదీనా భాష, ఎన్విరాన్మెంట్ అధికారి హరీష్, ఏరియా ఎస్టేట్ అధికారి సాగర్, ఇఇ సివిల్ మనోజ్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసనగా మే 20న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంత చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కోరారు. ఎస్టీయూ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, లోకేష్, తిరుపతి, శంకర్, మల్లేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మికులు, ఐఎఫ్‌టీయూ నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమకు రావల్సిన 12 నెలల వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు బ్రహ్మానందం మాట్లాడుతూ జిల్లాలోని పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 12 నెలలు వేతనాలు చెల్లించాలని కోరారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కొమురయ్య, లక్ష్మి, శారద, పార్వతి, శకుంతల, పోశక్క, సరోజ, జ్యోతి, సుజాత పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన కలిగి ఉండాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంలోని అంశాలు, హక్కులపై తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందికి మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని సందర్భంగా భూ భారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని చెప్పారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టంలో తీసుకు వచ్చిన అంశాలు, హక్కులపై ప్రతి అధికారి కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. భూ భారతి చట్టంలో అప్పీల్ చేసుకునే అంశం ఉందని చెప్పారు. ఏదైనా పట్టా మార్పిడి పై అప్పీల్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ధరణి పోర్టల్‌లో అప్పీల్ చేసుకునే అంశం లేదని తెలిపారు. ఆర్డీవో అధికారులకు అప్పీల్ చేసుకుని, అధికారి ఇచ్చిన జడ్జిమెంట్‌పై కలెక్టర్‌కు, సీసీఎల్‌ఏకు అప్పీల్ చేసుకునే కల్పించారని వివరించారు. విరాసత్, కొనుగోలు, గిఫ్ట్ డీడ్, పాలు పంపకం చేసుకునే దానిపై సంబంధీకులకు నోటీసు లు జారీ చేసే వీలు ఉందని తెలిపారు. ప్రతి పట్టా మార్పిడికి సర్వేయర్లు మ్యాప్ జత పర్చాల్సి ఉంటుందని చెప్పారు. ఇటువంటి అంశాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ అధికారులు చట్టంలోని పలు అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

కార్యక్రమంలో సర్వే ల్యాండ్ ఏడీ సోమేశ్వర్, తహసీల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్‌లు, గిర్దావర్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానికులను అవమానించడం సరికాదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎం యాజమాన్యం స్థానికులకు పనిరాదని, సోమరులని అవమానించడం సరికాదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకు డు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. కార్మికుల హక్కులను యజమాన్యం కాలరా బస్తుందన్నారు. సెలవులు తగ్గించారని, పెన్షన్ ఇవ్వడం లేదని చెప్పారు. ఇంక్రిమెంట్‌లు అమలు చేయడం లేదని, పంచ్ కూడా పని చేసే చోట పెట్టలేదని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే కంపెనీ క్వార్టర్‌లో పార్టీ కార్యాలయం పెట్టుకున్నారని చెప్పారు. ఆయన కార్మికుల తరపున మాట్లాడే ధైర్యం చేయడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన కాంట్రాక్టులు, కమీషన్ల కోసం యజమాన్యంతో కుమ్మక్కై కార్మికుల సంక్షేమం మరిచారని చెప్పారు. మాకు లారీలు లేవని, కర్ర నీరు, పేపర్లలో మాకు వాటా గానీ, కాంట్రాక్టు గానీ అవసరం లేదని తెలిపారు. కేవలం కార్మికుల సంతోషమే ముఖ్యమన్నారు. కంపెనీ బాగుండాలని, కార్మికులు కూడా బాగుండాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రెసిడెన్షియల్ ఆర్డర్ తెచ్చి కంపెనీ ప్రారంభించి 95 శాతం స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఒప్పందంతో పేపర్ మిల్లు ప్రారంభమైందని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం 60 శాతం కూడా స్థానికులు లేరన్నారు. స్థానికులకు పనిరాదని, సోమరులని యజమాన్యం అవమానపరుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశమంతా ఒక న్యాయం జరిగితే సిర్పూర్‌కో న్యాయం జరుగుతుందని తెలిపారు. స్థానికులకు తాము అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమానికి అంబాల ఓదేలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్యాంరావు, రాజ్‌కుమార్, మోహిన్, కన్నయయ, నాగులయ్య, పోశం, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

రెబ్బెన, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మతా రీసెర్చ్ సెంటర్ హైదరాబాద్ డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో గోలేటి టౌన్ షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్టు రెడ్డిమల్ల తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతము, అజీర్ణము, మలబద్దకము ఇతర వ్యాధులకు సంబంధించి ఈ శిబిరంలో వైద్యం అందించనున్నట్టు పేర్కొన్నారు.

ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలని రాజుర గ్రామంలోని పోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ఇటీవల ఏర్పాటు చేసిన బోర్‌ను మాజీ జడ్పీటీసీ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం బోరు వేయించామని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడు తామని తెలిపారు.

21న ఆలయ భూముల కౌలుకు వేలం

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథస్వామి ఆలయానికి చెందిన భూములను ఏడాది పాటు కౌలు సాగు చేసుకు నేందుకు ఈ నెల 21న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి వేణుగోపాల్ గుప్త మంగళవారం ఒక ప్రకటనలో తెలి పారు. 89.33 ఎకరాల వ్యవసాయ భూమి వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్‌జిరాక్స్‌తో పాటు, పాస్‌ఫొ టోలు, దరావత్తు సొమ్ము రూ.50 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 9618307962, 9908867600, 9885489088, 9491344496 లో సంప్రదించాలని సూచించారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో వేణుగోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో శిక్షణలో ఉన్న డీఎడ్ విద్యార్థులు ఈ నెల 21వ తేదీ వరకు మండలంలోని 56 పాఠశాలల్లో మౌలిక వసతులు లేని పాఠశాలలను గుర్తించి నివేదికలు తయారు చేయనున్నట్లు తెలిపారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించనున్నాని తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ హసీనా

పెంచికలపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్ హసీనా అన్నారు. మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గర్భిణులకు సీమంతాలు, పిల్లల బరువు, పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహారం, రక్తహీనతపై తల్లుల్లకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

పాఠశాలలకు వంట పాత్రల పంపిణీ

కౌటాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలంలోని పాఠశాలలకు మంగళవారం మండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఎంఈవోహన్మంతు పంపిణీ చేశారు. వీటిలో గంజులు, బకెట్స్, బేషన్, గ్యాస్ స్టౌవ్ సక్రమంగా వినియోగించుకుని ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసి సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం జిల్లా అధ్యక్షురాలు శారత, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో 38 పాఠశాలలకు మంగళవారం ఎంఈవో ప్రకాష్ వంట సామగ్రిని పంపిణీ చేశారు. గంజులు, బకెట్లు, గ్యాస్ స్టౌవ్ తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఆలయంలో అన్నదానం

కెరమెరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సావర్‌ఖేడ గ్రామానికి చెందిన హనుమాన్ మాలలు దరించిన క్తులు మంగళవారం హను మాన్ ఆల యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ జయంతి వరకు మాలలు ధరించిన 11 మంది భక్తులు పాదయాత్ర చేపట్టారు.

యువత క్రీడల్లో రాణించాలి

తిర్యాణి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని సీఐ బుద్దేస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రొంపల్లి గ్రామంలో వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు ఆత్రం గణేశ్ స్మారకార్థం నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఏర్పర్చుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. గణేశ్ క్రీడా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మండలానికి పేరు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, హెచ్‌ఎంలు కృష్ణారావు, గోపాల్, పీడీలు శేకు, లక్ష్మణ్, సుబాక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాబాపూర్‌కు ఆర్టీసీ బస్సు రాక

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



బస్సును ప్రారంభిస్తున్న ఎస్సై నరేష్

చింతలమానేపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్‌కు ఆర్టీసీ బస్సును అధికారులు మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి రోడ్డు ఉన్నా, ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పోవడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సైతం ఇచ్చారు. కాగా 'రోడ్డున్నా బస్సు రాదు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో మార్చి 4వ తేదీన కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి మంగళవారం నుంచి ఆర్టీసీ సేవలు ప్రారంభించడంతో బాబాపూర్ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై నరేష్ గ్రామస్థులతో కలిసి బస్సును ప్రారంభించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన 'ఆంధ్రజ్యోతి'కి ఈ సందర్భంగా గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.